



ఈ గాజుపూస పగిలితే నా గుండె పగిలి ముక్కలైపోతుంది – అనుకున్నాడు రవి. అందాల షోకేస్‌లో వున్న దాన్ని చూస్తూ కూర్చున్నాడు. కళ్ళ వెంట నీళ్ళు కారుతున్నాయి. ధారగా ముక్కుమీద, మూతిమీద, గడ్డంకింద నీరు. రవి తుడుచుకోలేదు.

వారం క్రితం ముచ్చటపడి షోకేస్‌లోని గాజుపూసను తీసి చూస్తుంటే చేయి జారి టేబిల్‌మీద పేపరు వెయిట్ మీద పడి ఒకపక్క చిన్న ముక్క విరిగి దూరంగా దొర్లిపోయింది. రవి గుండె కలుక్కుమంది. దొర్లిన ముక్క వెతికి క్విక్‌ఫిక్స్‌తో అతికించాడు. అతుకు కనిపిస్తూ వుంది. అయినా అఖండంగా వుంది. అతుకు బాధ కలిగిస్తూ వుంది.

ఆరోజు సుమతి గుండె నొప్పి అంది. హాస్పిటల్‌లో చేరిస్తే పరీక్షలు చేశారు. బైపాస్ సర్జరీ చేయాలన్నారు. ఈ వారమంతా ఆమెను ఆపరేషన్‌కు సిద్ధం చేశారు.

థియేటర్‌లోకి తీసుకుపోవడానికి సుమతిని సిద్ధం చేస్తుంటే ఆమెను చూడలేకపోయాడు రవి. ఐసియులో ఉన్న సుమతిని చూడడం కష్టంగా ఉంది. డాక్టర్లు, నర్సులు, రోగులు, విజిటర్లు ముందు ఏడుస్తుంటే అతడి పిల్లలు చూడలేక రవిని హోటల్‌కి తీసుకువచ్చి కూర్చోబెట్టారు. రూంలోకి వచ్చినప్పటినుంచీ గాజుపూస చూస్తూ కన్నీరుమున్నీరవుతూ కూర్చున్నాడు రవి. కొడుకు తోడుగా కూర్చున్నాడు. రవి తనకు గుండె నొప్పి వస్తుందేమో అనుకున్నాడు. పెద్దకూతురు తల్లితో వుంది. మాటిమా

టికి సెల్‌లో మాట్లాడుతూనే వుంది.

ఈ గాజుపూస యాభై ఏళ్ళ నుంచి తన దగ్గర భద్రంగా వుంది. అది అంగుళం పొడవు కూడా వుండదు. పావు అంగుళం కూడా వెడల్పుండదు. గుండ్రంగా వుంటుంది. దాని పొడుగునా పెద్ద రంధ్రం వుంది. అక్కడ కన్నుపెట్టి చూస్తేనే దాని అందం. లోపల ఎన్నో రంగులు. గుండ్రంగా తిప్పుతూ చూస్తుంటే సప్తవర్ణాలు నీలవర్ణాలుగా మారుతూ కనబడతాయి. ఎప్పుడు కూడా ఒకసారి కనిపించిన రంగుల కలయిక మళ్ళీ కనిపించదు. కన్ను వున్నచోటు వల్లనో, చూసే చూపువల్లనో, స్థానం, సందర్భం సమయం కలయిక వల్లనో కోటి రంగుల కూడలిగా అది కనబడుతుంది. రవి దాన్ని ఎన్నోసార్లు చూశాడు. ఎన్ని చిత్రవిచిత్ర రంగుల ప్రపంచాలు కళ్ళముందు పరచుకొనేవి. చూసిన ప్రతి సారీ పరమానందంగా, రంగుల చక్రాల భ్రమణాలు కళ్ళకు నూతన సౌందర్యాలు అతికించేవి. జీవితాంతం దాన్ని చూసుకుంటూ కాంతి వలయాలుగా రీళ్ళుగా తిరిగే రంగుల లోకాలు చూసి పులకించిపోయేవాడు రవి.

రవి దుఃఖంగా వుండడం వల్లో, కన్నీళ్ళతో కళ్ళు స్నానం చేస్తుండడం వల్లో, కళ్ళు తెప్పలై కన్నీటి మీద తేలిపోవడం వల్లో పూస బెజ్జం సరిగా కనిపించడం లేదు. రంధ్రంలో దృష్టి నిలవడం లేదు. గాజుపూసలో కన్నీరు ప్రయాణం చేసి పూస పూడుకుపోయింది. ఏ వెలుతురూ అందులో ప్రవేశించడం లేదు. గాజుపూస రంగుల ప్రపంచం పంచిపెట్టడం లేదు. ఏ అందమూ లేదు. ఏ రంగూ లేదు. రవి కన్నీరు మున్నీరు అవుతున్నాడు.

గాజుపూస తనకెంత ప్రాణమో అమ్మకు తెలుసు. పెళ్ళికి ముందు నీకు గాజుపూస లాంటి అమ్మాయి కావాలా, మల్లెమొగ్గ లాంటి అమ్మాయి కావాలా అని అడిగింది.

పూలన్నిటిలో మల్లెకున్న పరిమళం ఏ పూవుకూ లేదని రవి భావన. మల్లె సుగంధంతో ముక్కు గిల్లుతుంది. ముక్కు పిండుతుంది. ముక్కు పుటాలకు నృత్యం నేర్పుతుంది. నాసికాంతర్భాగంలో నాట్యం చేస్తుంది. ఊపిరితిత్తుల్ని ఊపూపి వదులుతుంది. ప్రాణవాయువును ప్రసాదించే ఊపిరితిత్తులకు ప్రాణం పోస్తుంది. ఉత్సాహం ఇస్తుంది. ఉద్రూతలూగిస్తుంది. కళ్ళు మూసుకుని మల్లె సువాసన పీలిస్తే ఊర్ధ్వలోకాలు దిగివస్తాయి. స్వర్గం కనిపిస్తుంది.

మల్లెలు సువాసనకే కాదు, సురూపానికీ ఆనవాళ్ళు. మల్లెలు మాలలై జడల్లో, ముడుల్లో దండలై, మెడల్ల అందాలై, గుడుల్లో పూజలై, పూలోడ సరాలై, పందిరిమంచం ద్వారాలై, పట్టుపరుపుల మీద పూల పడవలై, తలల్లో విచ్చుకొంటున్న మల్లెలు, మెడమీదికి జారే సరాలు. తలలో చీకటిని వెలిగించే సూర్యకిరణాలుగా, చంద్ర కిరణాలుగా చలువ పందిళ్ళుగా, వెలుగు వేదికలుగా, పరిమళ లోకాలై, సుగంధ రాయబారులై, జ్ఞాపకాల మీది మంచుపల్లకీలై మధురోహల మందిరా అందాలై, అనంతాలై, తెల్లని దిగంతాల సుందరాలై, సువాసన సుందర సుదూర స్వప్న లోకాల సంచారులై, మనసును మురిపించే మల్లెలు తనకెంతో ప్రాణం.

మల్లెమొగ్గ ఇష్టమా? గాజుపూస ఇష్టమా? చెప్పడం కష్టమే.

ఈ రెండింటితో రవి పరిచయం అతిబాల్యం నుంచి కొనసాగుతూ, స్నేహంగా, అన్యోన్య మైత్రిగా కొనసాగుతూ వచ్చింది.

బాల్యంలో పెళ్ళి ఊరేగింపుల్లో పూలోడలూ, పూసలోడలూ వచ్చేవి. పెళ్ళికూతుర్ని, పెళ్ళి కొడుకునూ కూర్చోబెట్టి, అన్ని వీథుల్లో రాత్రంతా ఊరేగించేవాళ్ళు. వాళ్ళ మెడల్ల మల్లెపూల మాలలు మాత్రం దండిగా, మెండుగా, గుండెల నిండుగా వేసేవాళ్ళు. పూల విందు వాళ్ళ ముక్కులకు మాత్రమేకాదు, వీథికంతా విందే! పూలోడ పరిమళంలో ఊరంతా తెప్పతేలియాడేది. ఊరేగింపులో పాల్గొన్నవాళ్లంతా, సువాసనలో ఈదులాడేవాళ్ళు. రాత్రంతా పరిమళ స్నానం.

రవి వాళ్ల ఇంటిలో పెరటినిండా మల్లెలు, గుండు మల్లెలు, సన్నజాజులు విరగబూస్తుండేవి. తల్లి తల ఎల్లవేళలా పూలబుట్టలా వుండేది. ఆమె తిరిగే ఇల్లంతా పూల సువాసనలో మునిగిపోయేది. పూలలో మల్లెసాగు. గంపలకొద్ది పూలు, బస్తాలకొద్దీ నగరానికి తరలింపు. పొలం నుంచి ఇంటికి నిత్య పరిమళం నడిచివచ్చేది. పొలం రాయబారాలు ఇంటికి తెచ్చేవి.

కానీ సంవత్సరం పొడుగునా మల్లెలు అంత విరివిగా ఉండేవి కావు. మండే ఎండలకు మల్లెలకు ఎంత స్నేహమో, ఎండలు పెరిగితే మల్లెలు పెరిగేవి. ఎండలు తగ్గితే మల్లెలు తగ్గేవి. మల్లెలు లేనప్పుడు సన్నజాజులే సంతర్పణ. ఎప్పుడూ మల్లెలు కావాలనిపించేది. ఎప్పుడో ఉండేవి. ఎప్పుడూ ఉండేవి కావు.

మల్లెమొగ్గ ఎంత మంచిదయినా, ఎంత పొడుగూ లావూ వున్నా, ఎంత పరిమళం ముక్కుకు దానం చేసినా రోజంతా ఉంటే గొప్ప రెండోరోజుకు పరిమళం మిగిల్చి తాను అదృశ్యమవుతుంది. సుగంధంతో స్నేహం మాత్రమే మిగిలి వుంటుంది. అదీ ఒక జ్ఞాపకం అయిపోతుంది. ఒకరోజు మల్లె! రెండు రోజులు పరిమళం! ఏ మల్లె ఎంతోకాలం దగ్గరుండేది కాదు. గాజుపూస అట్లా కాదు. యాభై ఏళ్ళు వెంటే వుంది. రంగుల లోకాలు చూపిస్తూ వుంది. కంటికింపో, గుండెకింపో - పూలు, పూస రెండూ కలిగిస్తున్నాయి. అయితే పూస వెంటే వుంది. ఎక్కడపెడితే అక్కడే ఉంది. ఎప్పుడు కావాలంటే అప్పుడు చూసుకునే వీలుగా ఉంది. రెండూ కావాలి. అమ్మ ఒకటే కోరుకోమంది. మల్లెల్ని కన్న మహారాణి అమ్మ. ప్రతి రోజూ మల్లెల్ని తలమీద ప్రతిష్ఠించే దేవత ఆమె. ఆమె ఇష్టం మల్లెమొగ్గనిచ్చినా, గాజుపూస తెచ్చినా, తనకు సంతోషమే. తల్లికి తగ్గ తనయుడు తాను. తల్లి కోరుకునే కోడల్ని ఎన్నుకోగలిగాడు.

ఊరేగింపులో పూలోడ నుంచి మల్లెమొగ్గ తుంచి తెచ్చి దాచేవాడు రెండోరోజు పారేసేవాడు. పూసలోడ నుంచి గాజు పూసలు తెచ్చేవాడు. అవి చాలాకాలం వెంట వుండేవి. ఈ గాజుపూస తనతో ఎంతోకాలం నుంచీ వుంది. అలా మల్లెమొగ్గ ఉండగలదా? ఒక్కరోజయినా దాని జీవితం ధన్యమే! కలకాలం ఉండాలనుకొంటే? కష్టమే!

సుమతి జీవితాంతం పరిమళం పంచింది. భార్యగా భర్తకు భద్రలోకాల సుఖశాంతులు ప్రసాదించింది. పిల్లల్ని పెంచి పెద్దచేసింది. ఇంటి పని వంట పని చేసింది. ఉద్యోగంలో పదిమందికి సంతోషం కలిగించింది. వాళ్ళను విద్యావంతుల్ని చేసింది. ప్రపంచ పౌరుల్ని తన చేతులు మీదుగా సాగనంపింది. తన కొడుకులు కూతుళ్ళు చక్కగా చదువుకుని మంచి ఉద్యోగులై, మంచి సంసారులై, మంచి పిల్లల తల్లిదండ్రులై సుఖంగా బ్రతికేటట్లు చూసింది. భార్యగా, తల్లిగా, అధ్యాపకురాలిగా అలుపులేకుండా విరామం లేకుండా కష్టపడింది. ముఖంమీద చిరునవ్వు మల్లెమొగ్గ పరిమళంలా పాకుతుండేద. చెరిగిపోని నవ్వును ముఖం లాకర్లో మూయకుండా ఉంచేది. దుఃఖం దరిచేరనివ్వలేదు. కన్నీళ్ళకు నిరంతరం వీడ్కోలు పలుకుతూ, దరహాసానికి స్వాగతం పలుకుతూ నిరంతరం, ప్రతిక్షణం జీవించి, సుఖిస్తున్నట్లు కనిపించి, నలిగిపోయి, తొందరలో వృద్ధాప్యం ముంగిట్లోకి వచ్చి, గుండెనొప్పి బాధ బయటికి రాకుండా కాలం కళ్యాణ తిలకం దిద్దుతూ వచ్చిన సుమతి ఆపరేషన్ థియేటర్లో వుంది. ఏమవుతుంది? ఈ మల్లెమొగ్గ మళ్ళీ పరిమళం వడ్డించాలి. ఈ మల్లెమొగ్గ పూవుకాకుండా మొగ్గగానే ఉండాలని రవి ఆశ.

రవి కళ్ళ ఎదుట గాజుపూస షోకేస్‌లో భద్రంగా ఉంది. ఎన్నిసార్లు చూసినా ఏ రంగూ కనిపించలేదు. తీసి మళ్ళీ చూద్దామంటే భయం. రంగుల లోకాల చక్రాల దొర్లింపులుంటాయో! ఉండవో! తీస్తే వణికే చేతుల్లో ఉంటుందో, జారుతుందో, పడుతుందో, బద్ద



లవుతుందో – భయం. బయటికి తీయలేడు – చూడకుండా ఉండలేడు. చూపునిండా కన్నీరు. గుండెనిండా సముద్రం. సముద్రంలో తేలియాడుతున్న గుండెఅలలు కళ్ళలోంచి చిమ్మించికొడుతున్నాయి. ఆగకుండా కన్నీరు.

రవి చిన్నతనంలో ఊరేగింపుల్లో పూసలోడ తళుకులు కాంతి చక్రాలు. వెలుతురు తరంగాలు రాత్రంతా జిగేలు జిగేలుమంటుంటే దానివెంటే తిరిగేవాడు. చూచినకొద్దీ చూడబుద్ధిపుట్టేది. తిరిగినకొద్దీ తిరగాలనిపించేది. నిద్ర వచ్చేది కాదు. కాళ్ళ నొప్పులుండేవి కావు. పూసల కాంతి తనను కట్టిపడేసేది. పలుపుతాడుతో దూడను కట్టుగొయ్యకు బందీని చేసినట్లు వెలుతురు తాడు రంగులతాడు, తళుకుల తాడు పూసలోడకు రవిని కట్టేసేవి. అతడికి మరేదీ ముఖ్యంకాదు. రంగురంగులుగా, గుత్తులు గుత్తులుగా పూసల సరాలు పెట్రోమాక్స్ లైట్ల వెలుతురులో కాంతుల గోళాలు, గోళీలు చెల్లాచెదురు కావడం అద్భుత దృశ్యం. తాను దాన్ని మర్చిపోలేడు. ఆ వెలుగుల అలలు కలకాలం తన హృదయంలో కదులుతూ ఉంటాయి. ఆ జ్ఞాపకాల ప్రతినిధి గాజుపూస.

రవికి చిన్ననాడు పెళ్ళంటే మల్లెపూల వాసనే. ఎక్కడ ఎప్పుడు మల్లె పరిమళం ముక్కును లొంగదీసుకున్నా, వధూవరులే కనిపిస్తారు. మల్లెవాసన నడిచి జారులో వచ్చినా, పెళ్ళి వధూవరులు శోభనం గది గుర్తుకువచ్చి, గుండె మెత్తబడి రబ్బరయిపోతుంది. స్పాంజి లాగా మారుతుంది. అది తన చైతన్యం సమస్తం పీల్చుకొంటుంది. రవికి బుద్ధి తెలిసిన నాటినుంచి పైచదువులకు పట్నం చేరిందాకా చాలా పెళ్ళిళ్ళు, ఊరేగింపులు, ఉన్నూర్లో, పొరుగూర్లలో చూశాడు. అన్ని పెళ్ళిళ్ళలో మల్లెసువాసన ఉండేది. పూసల కాంతివలయాలు ఉండేవి. బేండు మేళంతో, పెట్రోమాక్స్ లైట్ల వెలుతురు వానలేని రాత్రుల్లో, గాజుపూసల తళతళలు, మల్లెపూల మధుర పరిమళాలు కలగలిసిపోయేవి. మల్లెపూలు చూస్తుంటే గాజుపూసల రంగుల ప్రపంచం, గాజుపూసలు చూస్తుంటే మల్లెల మహా పరిమళ ప్రపంచాలు ముక్కును గుద్దుతూ ప్రవహించేవి. రాగారాగా మల్లెపూవు రంగుల లోకాలు చూడసాగింది. గాజుపూస మంచి సుగంధం వెదజల్లుతూ వచ్చింది. ఇంతకాలం షోకేస్‌లో వున్న గాజుపూస పరిమళ ప్రపంచాలు పరవశంగా అందించింది. ఇప్పుడది రంగులరాట్నమే కాదు సుగంధ సుందరస్వప్నం. గాజుపూస సువాసనిస్తుది. గదిలో వున్న పూస సువాసనకోసం అలమటించిపోతూ ఆశగా చూస్తున్నాడు.

అమ్మ గాజుపూస లాంటి మల్లెమొగ్గని, మల్లెమొగ్గ వంటి గాజుపూసని వెతకటంకోసం చాలా కష్టపడింది. గాజుపూస దొరికినా మల్లెమొగ్గ చేసుకోవచ్చు. మల్లెమొగ్గ దొరికినా గాజుపూస చేసుకోవచ్చు. అంతా మన చేతుల్లో వుంది. అదృష్టంలో వుంది. నిజానికి తనకు మల్లెమొగ్గే దొరికిందో, గాజుపూసే దొరికిందో కాని, షోకేసులో పరిమళించే గాజుపూస వుంది. రంగులు చిమ్మే మల్లెమొగ్గలా వుంది.

'అక్కకు ఫోను చేయి నాన్నా!'

'అక్కేం చేస్తుంది నాన్నా!'

'అమ్మ ఎలా ఉందో నాన్నా!'

'అమ్మ బాగుంటుంది నాన్నా!'

సుమతి తన జీవితం పొడుగునా సప్తవర్ణాల హరివిల్లుల సామ్రాజ్యాలు సృష్టించింది. పెళ్లయినప్పుడొక రంగు, కాపురానికి వచ్చినప్పుడొక రంగు, నెలతప్పినప్పుడొక రంగు, పిల్లలు పుట్టినప్పుడొక రంగు, వార్చి వడ్డిస్తూ ఒక రంగు, రాత్రి పడుకోబోయేముందు, ప్రసన్నమైన, ప్రశాంతమైన పవిత్రమైన ప్రభాసంపన్నమయిన, విలాసంగా వినూత్నంగా, అతి సుందర వర్ణ సమ్మేళనంతో ప్రకాశించిన సుమతి అందని ఎత్తులో ఆకాశం అంచుల్ని పట్టుకొని ఊపుతున్న ఇంద్రధనుస్సు లాగా ప్రకాశించేది. పరిమళించేది. పరవశించేది. పరవశింపచేసేది.

చిన్నప్పుడు పూసలోడల్లోంచి దొంగిలించి జేబులో దాచుకున్న పూసల కాంతులు, పరిమళాలు, సంగీతం శరీరాన్ని తాకుతున్నట్టుగా ఉండేది. తన నిక్కరు జేబులో ఒక పాట, ఒక పరిమళం, ఒక దృశ్యం కలిసి దాచినట్టు అనిపించేది. తనకే ప్రత్యేకంగా తెలిసిన రంగుల పరిమళ స్వప్నం తనను వెంటాడుతూ వుండేది. ఆ కలకు ఆకలి లేదు. నిద్ర లేదు. దాహం వేయదు. ఆ రోజుల్లో రవి నేలమీద నడిచేవాడు కాదు. ఆకాశంలో తేలిపోయేవాడు. గాలిలో పరుగెత్తేవాడు. ఊహల్లో ఊరేగేవాడు. తనకు కాబోయే, రాబోయే భార్య రంగుల పరిమళాల సంగీతాల సమ్మేళనంగా ఊహించుకొనేవాడు.

'అమ్మ లేకపోతే నేను బతకలేను నాన్నా!' బావురుమని ఏడ్చాడు రవి. కొడుకు ఓదారుస్తున్నాడు. తండ్రి పసిపిల్లవాడయ్యాడు. కొడుకు తండ్రి అయ్యాడు. తండ్రిని సముదాయిస్తున్నాడు. ఎన్నడూ ఏడవని తండ్రి ఏడుస్తుంటే కొడుకు తట్టుకోలేకపోయాడు.

పెళ్ళయి యాభై ఏళ్ళు అయినా కాలం ఎలా గడిచిందో రవికి గుర్తులేదు. కమ్మని, చెదరని కలలాగా సాగిపోయింది. ఏ ఒడిదుడుకులు లేవు. బతుకు పడవ నిండునదిలో అలవోకగా సాగిపోయింది. ఆమె సమస్య కాలేదు. ఏ సమస్యా రానీయలేదు. నలుగురు పిల్లలు బొమ్మల్లాగా పెరిగారు. ముద్దుగా చదువుకొన్నారు. మంచి జీవితాలు పొందారు. పిల్లాజెల్లాతో చల్లగా ఉన్నారు. ఇంత కష్టం తనకెప్పుడూ రాలేదు.

రవి కళ్ళు వర్షించసాగాయి. కొడుకు కళ్ళు తుడిచాడు. 'అమ్మకేం భయం లేదు. డాక్టర్లు సమర్థులు. మీరంటే ప్రేమ. పరీక్షలు బాగా చేశారు. ఏర్పాట్లు బాగున్నాయి. సమస్య ఏమీ ఉండదు' సర్దిచెబుతూనే వున్నాడు కొడుకు.

'అమ్మ లేకపోతే నేను బతకలేను నాన్నా!' బావురుమని ఏడ్చాడు రవి. కొడుకు ఓదారుస్తున్నాడు. తండ్రి పసిపిల్లవాడయ్యాడు. కొడుకు తండ్రి అయ్యాడు. తండ్రిని సముదాయిస్తున్నాడు. ఎన్నడూ ఏడవని తండ్రి ఏడుస్తుంటే కొడుకు తట్టుకోలేకపోయాడు.

'అమ్మకేమీ కాదు. బైపాస్ సర్జరీ ఇప్పుడు ముల్లు తీసినంత చిన్న ఆపరేషన్. ఇది పెద్ద ఆసుపత్రి. డాక్టర్లు విదేశీ విద్యా సామర్థ్యం పొందినవాళ్ళు. ఏ సమస్యా లేదు, రాదు. విజయవంతంగా ఆపరేషన్ జరుగుతుంది. ఇంకా పాతికేళ్ళు అమ్మ గుండెకు ఢోకా లేదు' అని ధైర్యం చెప్పాడు. 'మీరూ విన్నారు కదా... మీరు భయపడవద్దు. మీరు మాకు ధైర్యం చెప్పాలి. మీరే బేలగా అయితే ఎలా' కొడుకు ఏమేమో చెబుతూనే వున్నాడు. రవిని సుమతి ఆలోచన్ల నుంచి మరల్చటానికి కొడుకు చెబుతున్న మాటలవి అని తెలిసినా ఓదార్పుగా వున్నాయి.

షోకేస్‌లో గాజుపూసను చూస్తుంటే అవాంఛితం జరుగుతుందేమోనని గుండె అల్లకల్లోలం అవుతూ వుంది. పూసలోడల గాజుపూసలు తెంచడం తప్పేమో! తెలియక చేసిన తప్పు. బాల్యచేష్ట. తెలిసి చేయలేదు. తన తప్పు తనకు శిక్ష వేస్తుందా? రవికి భయం కలగసాగింది.

దొంగిలించిన ఎన్ని పూసలో జేబులో వేసుకొని తిరిగేవాడు. ఎక్కడ పడిపోయాయో! ఇదొక్కటే మిగిలి వుంది. మీసం మొలిచి, ఎత్తు పెరిగి, నిక్కర్లు పోయి, పేంటులు వచ్చినప్పుడు ఆ జేబుల నుంచి ఈ జేబుల్లోకి బదిలీ కావడంలో ఎన్నో పోయినా ఇదొక్కటే మిగిలి వుంది. దీన్ని తాను పోగొట్టుకోలేదు.

జేబులో వుంటే నలిగి పగిలిపోతుందేమోనని కంపాస్ బాక్స్‌కి మార్చాడు దాన్ని రవి. వృత్తలేఖిని ఇనుము ములికి పొడిస్తే పగిలిపోతుందేమోనని అమ్మ చిరిగిన ముఖమల్ జాకెట్టులో చుట్టి తన బట్టల పెట్టెలో పెట్టుకున్నాడు రవి. ఏది తగిలి పడుతుందోనని తనకు కొన్న మొదటి వాచీ షోకేస్‌లో నాటినుంచి నేటిదాకా దాన్ని దాచి ఉంచాడు.

సుమతి శోభనం గదిలోకి వచ్చినప్పుడు తాను ఆమెతో మాట్లాడిన మొదటి మాట 'గాజుపూస'. ఆమె సంతోషంగా చూసింది. దాన్ని చూపించాడు. చాలాసేపు చూసింది. రంధ్రంలోకి చూసింది. తానే భద్రంగా కేసులో పెట్టి పూలమధ్య పెట్టింది.

'ఇంద్రధనుస్సు చూశావా?' అని రవి అడిగాడు.

'ఎన్ని రంగులో!' అంది.

'గాజుపూస మల్లెల పరిమళం పంచిపెడుతుంది. నీకు పెట్టిందా?' అంటే 'ముక్కుకు కట్టింది' అంది.

గాజుపూసను రవికంటే అపురూపంగా సుమతి చూసుకోసాగింది. దాన్ని దాచుకోవడం మాత్రం రవి పనే!

యువతీయువకులుగా వధూవరులై, ఒకటై, చిలకా గోరింకలై, అందమైన దంపతులై, తల్లిదండ్రులై తాతా అవ్వలై శరీరం వార్ధక్యాన్ని పూసుకు తిరుగుతున్నా గుండెలో చిన్ననాటి గుసగుసలు వింటున్న యువతీ యువకుల వంటి సుమతీ రవుల్ని చూసి కన్నుకొట్టి నవ్వసాగింది గాజుపూస. 'ఏం' అని వాళ్ళడిగితే 'మీరిద్దరూ ముసలోళ్ళు' అంది. 'మరి నువ్వో' అంటే 'ముప్పై ఏళ్ళ వయస్సు దేవతను' అంది గాజుపూస.

'నువ్వు దొంగిలించిన గాజుపూసలు పడిపోకపోతాయా, పగలకపోతాయా, పారేసుకోకపోతావా, నా గుండె కోతపెడతావా. నీ గుండె కోత పడకపోతుందా, నా ఏడుపు తగలకపోతుందా, నువ్వు ఏడవకపోతావా' అని పూసలోడలూ, పూసలోడలూ

ఏకమై, తాను తెంచిన పూసల్ని, పూలని గుర్తుకు తెచ్చుకొని, నాటినుంచి నేటిదాకా శపిస్తున్నట్లుగా ఉన్నప్పటి మొదట్లో లెక్కచేయనివాడు, ఇప్పుడు శాపం తగులుతుందేమోనని భయపడుతున్నట్లుగా ఉన్నాడు.

మల్లెమొగ్గను తల్లో దాచుకొన్నట్టు, మధుర గీతం మనస్సులో భద్రం చేసుకొన్నట్లు, సుందర దృశ్యం కళ్ళల్లో నిలుపుకొన్నట్లు, అందమైన కల ఆత్మానందంలో నిలుపుకొన్నట్లు గాజుపూసను జాగ్రత్తగా కాపాడుకొంటూ వచ్చాడు రవి. పగలకుండా చూశాడు. పడిపోకుండా జాగ్రత్తపడ్డాడు. ఆభరణాలు, అలంకారాలు అడ్డురాని ప్రేమ అనురాగం, ఆత్మీయత అనుబంధం మధ్య దాచి ఉంచాడు. పిల్లలు చూసినా, వాళ్ళ చేతుల్లో చేతల్లో పడకుండా పాడుకాకుండా దాచాడు. అలుపెరుగని ఆనందంతో దాన్ని ఆలింగనం చేసుకునేవాడు. కష్టం కలగని తృప్తితో పూసను పూజించాడు. సుడులెత్తే ఉద్రూతల ఆవేశాన్ని ఆత్మీయ సౌందర్యం కావించుకొని దాన్ని సంరక్షించాడు.

కాలం తెచ్చే మార్పులు గాజుపూసలో కనిపించసాగాయి. రంగు తగ్గినట్లు భ్రాంతి, వెలిసిపోయినట్లు భ్రమ. నునుపు, తెలుపు, మెరుపు తగ్గుతున్నట్లు సందేహం. రేగడి ధూళి, గరువు దుమ్ము కొట్టుకున్నట్లుగా ఉంటే శుభ్రంగా దాన్ని తుడిచేవాడు. కడిగేవాడు. ఆరబెట్టేశాడు. దాచిపెట్టేవాడు.

రంగు తగ్గినట్లుగా, వాసన మాయమయినట్లుగా అనిపించినప్పుడల్లా గాజుపూసను పక్కనపెట్టి, భార్య దగ్గరకు పోయి. అవసరాలు చూసి, అవకాశాలు పరికించి, ఆత్మీయత వెలిబుచ్చి, అనురాగం అందించి, గాజుపూస పూర్వం రంగు పూర్వ పరిమళం పంచేటట్లు చేస్తుండేవాడు రవి. కానీ ఈమధ్య ఏమీ చేయలేని అశక్తుడయ్యాడు. ఆమె ఆరోగ్యం బాగా దెబ్బతింది. తుమ్మి, దగ్గి, జ్వరమని, తలనొప్పి అని ఎరుగని భార్య గుండెనొప్పి అంటే కుమిలిపోయాడు. కోలుకోలేకపోయాడు. గాజుపూస పూర్తిగా రంగులు తగ్గి పరిమళాలు కోల్పోయింది. దాన్ని చూస్తుంటేనే భయం.

ఆరోజు సాయంకాలం ఇంటికి తిరిగివస్తుంటే పూలోడలు పూసలోడలు కలిసివచ్చి 'ఆ రంగుల గాజు పూస పగల్లేదా, జారిపోలేదా, రంగు తగ్గలేదా? వాసన మాయం కాలేదా?' అని అడిగినట్లు భ్రమ కలిగింది. వేగంగా ఇంటికి రాగానే అమ్మను హాస్పిటల్‌కు తీసుకుపోవాలని పిల్లలు సిద్ధమవుతున్నారు. అందరూ కలిసి ఆసుపత్రికి వచ్చారు. సుమతికి గుండెపోటు!

చిన్నప్పుడు తనెన్నో కలలు కన్నాడు. పెళ్లికూతురు పక్కన కూర్చుని పూలోడలోనో, పూసలోడలోనో ఊరేగాలనుకొన్నాడు. కుదర్లేదు. గుర్రంమీద ఊరేగింపు వుంటుందనుకున్నాడు. అదీలేదు. గ్రాంఫోను రికార్డు పాటలతో, డాన్సులతో కారులో మెరవణి పెట్రోమాక్స్ లైట్ల మధ్య ఊహించుకున్నాడు. ఊహ నిజంకాలేదు.

పెళ్లి ఇంటిదగ్గర జరగలేదు. బంధువులు రాలేదు. ఎవరి తల్లిదండ్రులూ లేరు. మిత్రులంతా పదిమంది. వాళ్ల సమక్షంలో పెళ్లి. రవి తల్లిదండ్రులు పేదింటి పిల్ల వద్దన్నారు. సుమతి తల్లిదండ్రులు కులం పట్టింపులు తెచ్చారు. చివరికి ఇరువురి తల్లిదండ్రులు ఇష్టపడకపోయినా వాళ్ళు పెళ్లి చేసుకున్నారు.

సుమతి సన్నం, పల్చన, ఊపిరి లేనట్లుండేది. కానీ శరీరం నిండా బలమే! కడ్డీబలం! ఇనుం ముక్కలో కరగడం మొదలైతే మంచుముక్క!

ఇంటి పనుల్లో, వంట పనుల్ల ఆడమనిషికి మగ మనిషి తోడు కావటం సుమతి నమ్మలేకపోయేది. గట్టుగొయ్య చుట్టూ తిరిగే లేగదూడలాగా భర్త తన చుట్టూ తిరుగుతుంటే, మొదట నమ్మలేకపోయి, తర్వాత నమ్మి, చూసి, అనుభవించి, ఆనందించి, పరవశించిపోయేది సుమతి.

మొదట్లో ఎవరిదీ రాకపోకలు లేకపోయినా, బంధువులు క్రమంగా రాసాగారు. అన్నదమ్ములు అక్కచెల్లెళ్ళు వచ్చి, చూసి, ఆనందించిపోసాగారు. అమ్మానాన్నలు వచ్చి ఆశీర్వదించే స్థితీ కలిగిం. ముత్యాలు రత్నాలు లాంటి నలుగురు పిల్లల్ని ఆదరంగా ఆప్యాయంగా అందరూ చూసుకోసాగారు.

ఆరోజుల్లో గాజుపూసలో ఎన్ని రంగులో! ఎంత పరిమళమో! ఎంత అందమో! ఎన్ని కలలో! ఎన్ని కళలో!

'కాఫీ కావాలా నాన్నా!'

'కావాలి నాన్నా!'

కొడుకు కాఫీ ఇచ్చాడు. తండ్రి తాగుతూ తాగలేక పక్కనపెట్టి 'ఆపరేషన్ అయి వుంటుందా?' అని నిట్టూర్చాడు. ఏడుపు గొంతులోకి తన్నుకువచ్చింది. 'సక్సెసా?' అని ఏడ్చేశాడు.

'హాస్పిటల్‌కి పోదాం నాన్నా!'

'పోదాం నాన్నా! అక్క ఫోను రానీ'

అప్పుడే ఫోను వచ్చింది. కూతురు కాదు. ఎవరో మిత్రుడు. సానుభూతి కూడా సహించడం కష్టమే!

తండ్రిని ఉత్సాహపరచడానికి. తమ పోషణ, తమ క్రమశిక్షణ, తమ చదువులు, తాము ఆదర్శపౌరులుగా తీర్చిదిద్దబడడం చెప్పి, ఆనందంతో కొడుకు పరవశుడవుతుంటే సుమతే గుర్తుకురాసాగింది రవికి.

తమ పిల్లలు, వాళ్ళ చదువులు, ఆటపాటలు, తాతను జేజిన రోజూ తలుచుకోవడం చెబుతుంటే ముచ్చటగానే ఉందికాని, సుమతి ఎలా ఉందో అని పిస్తూ ఉంది.

రవి షోకేసులోనుంచి భద్రంగా గాజుపూసను వెలుపలికి తీశాడు. సున్నితంగా తుడిచాడు. సుకుమారంగా ఊదాడు.

భయం నయంగా గాజుపూస బెజ్జంలోంచి గుండెల గాలి అంతా ఊదాడు. పూసలో నీటిచెమ్మ కొట్టుకుపోవటమే కాక, గుండె గాలి వేడికి లోపలి చెమ్మంతా ఆరిపోయింది.

తడబడుతున్న కంటిని తుడుచుకున్నాడు, అద్దుకున్నాడు రవి. గుండె నిబ్బరం చేసుకున్నాడు. గుండె లోపల నుంచి వెలికి ఉరికే నీటికి ఎక్కడో ఆనకట్ట కట్టాడు. అయినా ముఖంలో దుఃఖం, చీకటి నీడలు పరుచుకునే వుంది. నెమ్మదిగా కంటి దగ్గర పెట్టుకున్నాడు. అటూ ఇటూ తిప్పాడు. ముఖంలో చీకటి నీడలు చెదిరిపోసాగాయి.

గాజుపూసను కంటిదగ్గర చకచకా దొర్లించినట్లు తిప్పాడు. ముఖంమీది చీకటి తెరలు మాయమయి ఉషోదయం తెలిరేకలు కమ్ముకొన్నట్లుగా ఉంది.

బాల్యంలోని ఉత్సాహంతో గాజుపూసను తిప్పి తిప్పి చూసినట్లు మళ్ళీమళ్ళీ చూశాడు. ముఖం వెలిగిపోసాగింది.

గుండె నిండా గాలి పీల్చుకున్నాడు. గాజుపూస అందించే గాలి అంతా వదలకుండా గుండెల్లో భద్రం చేసుకోవటానికి అన్నట్లుగా పీల్చుకున్నాడు రవి.

తండ్రి ముఖం చూసి సంతోషపడ్డాడు కొడుకు.

కొడుక్కు గాజుపూస ఇచ్చి, 'మల్లె పరిమళం ఎలా ఉంది చెప్పు' అన్నాడు రవి.

కొడుకు గాలిపీల్చి 'మత్తుగా' అన్నాడు.

'రంగుల ప్రపంచాల ఆవర్ణాలు చూడు! అమ్మ ముఖం చూడు'

గాజుపూస రంధ్రం దగ్గర కన్నుపెట్టి చూసి 'హరివిల్లు నర్తనశాల; అమ్మ నవ్వుతూ ఉంది' అన్నాడు కొడుకు.

తండ్రి గాజుపూస తీసుకుని, ఊది, తుడిచి, కేసులో పెట్టి, దాన్ని పేంట్ జేబులో పెట్టుకొని అన్నాడు–

'ఆపరేషన్ అయిపోయింది. విజయవంతంగా జరిగింది. అమ్మను థియేటర్ నుంచి ఐసియుకి తీసుకువస్తున్నారు. లే. పద. పోదాం. అమ్మను చూడాలి. మాట్లాడాలి'.

తండ్రి నవ్వుముఖం వెలుగుతూ ఉంది. 'గాజుపూస పగలదు, నా గుండెకు భయంలేదు' అనుకున్నాడు రవి. ఫోను మోగింది.

★

